సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 6 । మార్చి । 2024

న్యూస్‌రీల్

నేటి నుంచి టెక్నికల్ ఫెస్ట్

కేయూ క్యాంపస్: కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో రూబీ జెస్ట్–24 (టెక్నికల్‌ఫెస్ట్)ను నిర్వహించనున్నారు. ఆడిటోరియంలో నిర్వహించే ఈ ఫెస్ట్‌కు కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, అతిథులుగా కలెక్టర్ సిక్తాపాట్నాయక్, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. టెక్నికల్ సెషన్‌లు, చర్చా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 7వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



విద్యారణ్యపురి: ఎన్నికల కోడ్ రాకముందే ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ఆ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రవీందర్, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు సీఎస్‌ఆర్ మల్లిక్, లింగారావు, మోజెస్, చంద్రయ్య, రాజారామ్, శ్రీనివాస్, భాస్కర్‌రావు, సదానందం పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

విద్యారణ్యపురి: తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఏప్రిల్–మే నెలలో నిర్వహించనున్నారు. ఆయా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు మంగళవారం తెలిపారు. జిల్లాలో అడ్మిషన్లు పొందిన, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 7వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. మీసేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థులే స్వయంగా పరీక్ష ఫీజులు చెల్లించాలన్నారు.

448 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో జనరల్ విభాగం, ఒకేషనల్ కోర్సులు కలిపి 448 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. ఇంటర్ సెకండియర్ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 18,380 మంది హాజరుకావాల్సి ఉండగా.. వారిలో 17,932 మంది హాజరైనట్లు తెలిపారు.

స్టాఫ్ నర్సు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధి శంభునిపేట దూపకుంట రోడ్డులోని వరంగల్ (బాలికలు–2) మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్స్ పోస్టు(1) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ అండ్ ప్లేస్‌మెంట్ ఏజెన్సీ నిర్వాహకుడు హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు కేయూ క్రాస్‌రోడ్ పాత ఆర్టీఏ కార్యాలయం, నయీంనగర్, హనుమకొండ వద్ద గల తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 83176 47072 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహా రుద్రయాగం ప్రారంభం



హన్మకొండ కల్చరల్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా భద్రకాళి దేవాలయంలో మంగళవారం మహా రుద్రయాగం ప్రారంభమైంది. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద విద్యార్థులు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించి, మహా రుద్రయాగం నిర్వహించారు. శుక్రవారం వరకు యాగం కొనసాగుతుందని శేషు తెలిపారు.

అర్హులందరికీ 'గ్యారంటీ'లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎస్ఓ శివప్రసాద్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ పనులు పూర్తిచేయండి

వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిపై డీఎంఈ ఎస్.వాణితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీఎంఈ శివరాంప్రసాద్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి, ఎంజీఎం, కేఎంసీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, మోహన్‌దాస్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డితోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





హవ్వ.. ఇదేం 'స్మార్ట్' రోడ్డు!

ఈ సిమెంట్ రోడ్డును చూడండి. వరంగల్ పరిధిలోని లేబర్‌కాలనీ నుంచి ఏనుమాముల మార్కెట్ జంక్షన్ దారి ఇది. దీన్ని స్మార్ట్ సిటీకింద రూ.కోట్లు వెచ్చించి వేశారు. ఈ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. కానీ ఎక్కడికక్కడ సిమెంట్ లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు ఎక్కడికక్కడ బీటలు వారింది. నగరంలో అండర్ డ్రెయినేజీ కోసం తెచ్చిన పైపులను ఇలా రోడ్డు మధ్యలో వేశారు. రాత్రి సమయంలో ఈ పైపుల మధ్య నుంచి రోడ్డు క్రాస్ అవుతూ చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

'గ్రేటర్' హస్తగతం!

కాంగ్రెస్ గూటికి వరుస కడుతున్న కార్పొరేటర్లు

- ఇప్పటికే తీర్థం పుచ్చుకున్న 10 మంది కార్పొరేటర్లు
- 12 మంది డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల చేరిక
- అదే దారిలో మరో నలుగురు కార్పొరేటర్లు
- విలీన డివిజన్‌కు చెందిన మరో కార్పొరేటర్
- గులాబీ దళంలో మొదలైన గుబులు



హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. మరో రెండు నెలల్లో హస్తగతం చేసుకునేందుకు దాదాపుగా రంగం సిద్ధమైంది. వారం రోజుల క్రితం గ్రేటర్ వరంగల్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు పాలకవర్గ పెద్దలపై అసహనం వ్యక్తం చేస్తూ.. తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఈనేపథ్యంలో మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన 10 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 12, 18, 19, 21, 22, 24, 27, 33, 38, 41వ డివిజన్ల కార్పొరేటర్లు కావటి కవితయాదవ్, వస్కుల బాబు, స్వర్ణలత, పూర్ ఖాన్, బస్వరాజు కుమారస్వామి, ఆకుతోట శిరీష్(కార్పొరేటర్ రామా తేజస్వి భర్త), చింతాకుల అనిల్, ముష్కమల్ల అరుణ, బైరబోయిన ఉమా దామోదర్, పోషాల పద్మ, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన జన్ను షీభారాణి కొండా దంపతుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్లు డివిజన్లలో నెలకొన్న, అంతర్గతంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలు కొండా దంపతుల దృష్టికి తీసుకెళ్లినట్లు, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మాజీ కార్పొరేటర్లు నాగపూరి కల్పన, జారతి రమేశ్, ఓని భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు నాగపూరి సంజయ్, చిప్పా వెంకటేశ్వర్లు, కొదాటి అనిల్, మేరుగు అశోక్ తదితరులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విధంగా బీఆర్‌ఎస్ 12 డివిజన్ల అధ్యక్షులు హస్తం గూటికి చేరారు.

బల్దియా ముఖచిత్రం

మొత్తం డివిజన్లు 66

బల్దియా ఎన్నికల సమయంలో పార్టీల బలాబలాలు
- బీఆర్‌ఎస్ 48
- బీజేపీ 10
- కాంగ్రెస్ 04
- ఇతరులు 4

(ఛైర్మన్ ఎన్నిక సమయంలో ఇతరులు చేరారు. దీంతో బీఆర్‌ఎస్ సంఖ్య 52)

ప్రస్తుతం పార్టీ మారిన నేపథ్యంలో బలాబలాలు
- బీఆర్‌ఎస్ 34
- కాంగ్రెస్ 22
- బీజేపీ 09

(బీఆర్‌ఎస్‌లోని మిగిలిన వారిలో కూడా సగానికిపైగా హస్తం గూటికి చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు)

నేడు సీఎం రేవంత్ రెడ్డితో..

సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, డివిజన్ పార్టీల అధ్యక్షులు బుధవారం కలవనున్నారు. కొండా దంపతులు ఆ దిశగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు కార్పొరేటర్లు ప్రయత్నించారు. కానీ సీఎం బిజీ షెడ్యూల్ కారణంగా రెండ్రోజులు ఆలస్యమైంది.

మరో నలుగురు..

వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు త్వరలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. వాళ్లను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుజ్జగిస్తున్నప్పటికీ మాట వినడం లేదని సమాచారం.

అంతా హస్తమయమే!

బల్దియాలో 66 డివిజన్లు ఉండగా ఎన్నికల సమయంలో 48మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు గెలుపొందారు. కాంగ్రెస్ నాలుగుస్థానాలను కైవసం చేసుకుంది. ఇప్పటికే అధికారికంగా తూర్పు, పశ్చిమలో కలిసి 22 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. మిగతా వారు కూడా అదేదారిలో ఉన్నారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని విస్తృత ప్రచారం జరుగుతోంది. కాగా.. తూర్పు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మరో నలుగురు కార్పొరేటర్లను తమ పార్టీలో చేర్చుకునేందుకు కొండా దంపతులు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. మేయర్ గుండు సుధారాణి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆమె చేరిక కూడా దాదాపు ఖాయమైందని చర్చ జరుగుతోంది. అయితే మరో రెండేళ్ల పదవీ కాలం ఉండడంతో పూర్తి కాలం తనకు అవకాశం కల్పిస్తే చేరేందుకు ఆమె సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మరో రెండు నెలల్లో కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠంతోపాటు డిప్యూటీ మేయర్ స్థానాలను కైవసం చేసుకుంటుందనే సంకేతాలు వస్తున్నాయి.

వివరాల నమోదుకు చర్యలు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అధికారులకు శిక్షణ

హన్మకొండ అర్బన్: ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అర్హుల పూర్తి వివరాలను ఆపరేటర్లు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎంపీడీఓలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, జీడబ్ల్యూఎంసీ, పరకాల పురపాలక శాఖ అధికారులకు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాల నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ దరఖాస్తుల నమోదుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు.



శిక్షణలో కలెక్టర్, ఎంపీడీఓలు, అధికారులు

అర్హులకు పథకాలు చేరేందుకే సేవా కేంద్రాలు

అర్హులందరికీ పథకాలను అందించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు స్టేట్ ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వి తెలిపారు. మంగళవారం ప్రజాపాలన, సేవా కేంద్రాలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, డీఆర్డీఓ నాగపద్మజ, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు 12 కేంద్రాలు

వరంగల్ అర్బన్: ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుల సవరణ, స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ, స్వీకరణకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ఈ–సేవ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అడిషనల్ కమిషనర్ పలు సూచనలు చేశారు. డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రాలివే..

హనుమకొండ పరిధి కాజీపేట సర్కిల్ ఆఫీస్, సుబేదారి వాటర్‌ట్యాంక్, నక్కలగుట్ట ఈ–సేవ కేంద్రం, మచిలీబజార్ కమ్యూనిటీ హాల్, అశోకా సర్కిల్, నయీంనగర్ ఈ–సేవ కేంద్రం.

- వరంగల్ పరిధిలోని బల్దియా ప్రధాన కార్యాలయం, పోచమ్మ మైదాన్ ఈ–సేవ, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం, హెడ్ పోస్టాఫీస్, శివనగర్, ఉర్సు కరీమాబాద్ ఈ–సేవ కేంద్రం.

దోపిడీ పాలకులకు బుద్ధి చెప్పాలి

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

వరంగల్: దేశ సంపదను కొల్లగొట్టి పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని, సామాజిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. మంగళవారం కమ్యూనిస్టు కో–ఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) పిలుపు మేరకు ఎంసీపీఐ(యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే మోదీ పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులకు గోనె కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పెద్దారపు రమేశ్, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, చంద్రయ్య, కొమురయ్య, గడ్డం నాగార్జున, ప్రతాప్, బాబూరావు, రాగసుధ, సావిత్రి, వెంకన్న, కుమారస్వామి, రాజమౌళి, ఇస్మాయిల్, అరుణ్, రాజు, మల్లికార్జున్, నాగేశ్, నర్సయ్య, ఉస్మాన్, భద్రయ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

అయోధ్యకు తరలిన భక్తులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు, అధికారులు జెండా ఊపి అయోధ్య రైలును పంపించారు. ఉమ్మడి జిల్లా నుంచి కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులకు స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ఐఆర్‌సీటీసీ అధికారులు ఐడీ కార్డులిచ్చారు. 22 బోగీలతో కూడిన ఎక్స్‌ప్రెస్‌కు బుకింగ్ చేసుకున్న 1,471 మంది ప్రయాణికులు ఈరైల్లో అయోధ్యకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ అదనపు రైల్వే కమర్షియల్ మేనేజర్ ఐఎస్‌ఆర్.మూర్తి, కాజీపేట సీటీఐ జనరల్ విజయ్‌కుమార్, సీసీఐ సజ్జన్‌లాల్, వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ కృష్ణ ప్రయాణికులకు సూచనలిచ్చారు. అయోధ్య రైలు ప్రయాణికులతో కాజీపేట జంక్షన్‌లో సందడి నెలకొంది.



జెండా ఊపి అయోధ్య రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

కేయూ రిజిస్ట్రార్‌తో అకుట్ బాధ్యుల వాగ్వాదం

కేయూ క్యాంపస్: రెండేళ్లుగా అధ్యాపకుల సమస్యలను వీసీ, రిజిస్ట్రార్లు పరిష్కరించడం లేదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి ఇతర సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని అంశాలవారీగా రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకదశలో వాగ్వాదానికి దిగారు. అధ్యాపకులకు గతంలో పదోన్నతులు కల్పించారని, వారికి ఇప్పటివరకు ఎరియర్స్‌ను చెల్లించడం లేదన్నారు. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించిన కేసు విషయంపై సీనియర్ అడ్వకేట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులకు దరఖాస్తులు స్క్రూటినీ చేశాక ఇంటర్వ్యూలు నిర్వహించని వారికి వెంటనే ఇంటర్వ్యూలు నిర్వహించాలని కోరారు. క్యాస్ పదోన్నతులకు సంబంధించి 43మంది అధ్యాపకులకు ఎరియర్స్ చెల్లించాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఫిజిక్స్, మ్యాథ్స్, సోషియాలజీ విభాగాల్లో రొటేషన్ ప్రకారం ఇవ్వాల్సిన విభాగాల అధిపతుల పదవులను వెంటనే కేటాయించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేశ్, సుదర్శన్, పి.శ్రీనివాస్, భారవి శర్మ, సోమయ్య తదితరులున్నారు.

'విద్యా నిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: నిరుపేద ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పోలీస్‌శాఖలో గందరగోళం!

మూడు రోజుల ముచ్చటగా పోస్టింగ్‌లు

- బాధ్యతలు చేపట్టి నెల కాకముందే మళ్లీ బదిలీ
- లబోదిబోమంటున్న ఇన్‌స్పెక్టర్లు
- కమిషనరేట్‌కు కొత్త ముఖాలు
- నిబంధనలతో ఇబ్బందులు..

వరంగల్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలు పోలీస్‌శాఖలో గందరగోళం సృష్టిస్తున్నాయి. పూటకో జీఓతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. నాలుగున్నర సంవత్సరాల్లో వరుసగా మూడేళ్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసిన అధికారులకు స్థానచలనం తప్పడం లేదు. కమిషనరేట్‌లో ఇప్పటికే నాలుగు సార్లు ఇన్‌స్పెక్టర్ల బదిలీలయ్యాయి. ఇటీవల జరిగిన భారీ బదిలీల్లో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. కాసులు కురిపించి పోస్టింగ్‌లు దక్కించుకున్న అధికారుల ఆశలు మూడు రోజుల ముచ్చటగా మారిందన్న టాక్ వినిపిస్తోంది. విశ్వప్రయత్నాలు చేసి పోస్టింగ్‌లు దక్కిన తరువాత మారిన నిబంధనలతో మరోసారి బదిలీ తప్పదనే విషయం తెలిసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా కమిషనరేట్‌లో వివిధ పోలీస్ స్టేషన్లతో పాటు పలు విభాగాల్లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు కొంత మంది ముందుచూపుతో నిబంధనలు వర్తించని పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసుకుని పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. వారికి కూడా మూడేళ్ల నిబంధన వర్తించడంతో బదిలీ తప్పడం లేదు.

నిన్న పోస్టింగ్.. నేడు ఊస్టింగ్!

ఇటీవల జరిగిన బదిలీల్లో పోస్టింగ్‌లు పొందిన ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాక ముందే బదిలీ అవుతున్నారు. మంగళవారం వెలువడిన ఉత్తర్వుల ప్రకారం కమిషనరేట్‌లో 8 నుంచి10 మంది ఇన్‌స్పెక్టర్లు బుధవారం బదిలీ కానున్నారు. దీనికోసం కమిషనరేట్ అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మరోసారి నిబంధనలు మారినా మరెవ్వరికీ ఇబ్బంది కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతానికి భిన్నంగా ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు కూడా బదిలీ తప్పడం లేదు. గతంలో ప్రధానంగా లా అండ్ ఆర్డర్ పోస్టింగ్‌లలో ఉన్న అధికారులకే నిబంధనలు వర్తించేవి. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. కమిషనరేట్‌లో తమకు డోకా లేదు అనుకున్న అధికారులకు సైతం పెద్ద షాక్ తగిలింది. దీంతో కొంతమంది అధికారులకు నిన్న పోస్టింగ్... నేడు ఊస్టింగ్‌లా మారింది.

మారనున్న పోస్టింగ్‌లు ఇవే....

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మారిన నిబంధనల ప్రకారం కాకతీయ యూనివర్సిటీ, ఆత్మకూరు, ఏనుమాముల, గీసుకొండ, కాజీపేట ట్రాఫిక్, రూరల్ మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు మరికొన్ని పోస్టింగ్‌లు మారే అవకాశం ఉంది. ఇటీవల మల్టీజోన్ 1 నుంచి కమిషనరేట్‌కు వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు ఈ పోస్టింగ్‌లు దక్కనున్నాయి. దీంతోపాటు బయటినుంచి కూడా కొన్ని కొత్త ముఖాలు కమిషనరేట్‌కు పరిచయమయ్యే అవకాశాలున్నాయి. బదిలీ అవుతున్న అధికారులు మాత్రం తీవ్ర నిరాశతో ఉన్నారు. మారిన నిబంధనలు ఎమ్మెల్యేలను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వారిని నమ్ముకుని వచ్చిన అధికారులు బదిలీ కావడంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమకు నచ్చిన అధికారులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు కానీ నిబంధనలు అడ్డుపడడంతో ఏమీ చేయలేకపోతున్నారు.

టీఎన్జీఓస్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, టీఎన్జీఓస్ కేంద్ర సంఘ ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ తెలిపారు. అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్, కార్యదర్శిగా బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారిగా పనికెల రాజేశ్ ఎన్నికయ్యారని, వీరితో పాటు మిగతా కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి కూడా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం టీఎన్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో జరిగే స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ నాయకులు రామునాయక్, మోయిస్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, రాజమౌళి, రాజ్యలక్ష్మి, మేరీ జయంతి, శ్రీలత, పవన్‌కుమార్, రాంప్రసాద్, కుమారస్వామి, సురేశ్, రాజేశ్ ఖన్నా, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



రాజేందర్, సోమయ్య, వేణుగోపాల్, రాజేశ్

క్లుప్తంగా

ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల (ఇంటర్ యూనివర్సిటీ) సైక్లింగ్ పోటీలు(మెన్) నిర్వహించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్యతో కలిసి మంగళవారం సైక్లింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. కేయూనుంచి హుజూరాబాద్ వరకు అక్కడి నుంచి కేయూ వరకు(50 కిలోమీటర్లు) ఈ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ పోటీలకు ఐదుగురిని ఎంపిక చేసినట్లు వెంకయ్య తెలిపారు. అందులో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మహ్మద్ హబీబుద్దీన్, వరంగల్ కిట్స్ కళాశాల నుంచి జె.సంజీవ్, బి.మహేష్‌బాబు, ఎం.జశ్వంత్, హనుమకొండలోని మాస్టర్జీ డిగ్రీ కళాశాల నుంచి మహ్మద్ రియాజ్ ఉన్నారని తెలిపారు.

ఆరో రోజు రూ.1.46కోట్లు

హన్మకొండ కల్చరల్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు కొనసాగుతోంది. హనుమకొండ టీటీడీ కల్యాణమండలంలో మంగళవారం ఉదయం 59 ఐరస్ హుండీలను విప్పి లెక్కింపు జరుపగా ఆరో రోజు రూ. 1,46,09,280 ఆదాయం లభించింది. మొత్తం 540 హుండీల్లో రూ.12,71,79,280లు నమోదు అయిందని, వాటిని బ్యాంకులో జమ చేశామని ఈఓ రాజేంద్రం తెలిపారు. అలాగే 779 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 55.150 కేజీల వెండి లభించిందన్నారు.

ఎస్ఈల రిక్రూట్‌మెంట్‌పై ఇంటెలిజెన్స్ ఆరా!

అవకతవకలు జరిగాయని ప్రజాపాలనలో ఫిర్యాదు
- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు
- టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో జరిగిన సబ్ ఇంజనీర్ (ఎస్ఈ)ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు, అవకతవకలపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు పోస్టులు భర్తీ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని అర్హత సాధించి, కాల్ లెటర్ అందుకుని అవకాశం కోల్పోయిన అభ్యర్థులు హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీలో తమకు అన్యాయం జరిగిందని, తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఈ నియామకాలపై ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టి అవకతవకలు, అక్రమాలపై కూపీ లాగుతున్నట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాల్ లెటర్‌లు పొందిన తమను విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థులు టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

70 పోస్టులు తగ్గించారు..

టీఎస్ ఎన్పీడీసీఎల్ 497 సబ్ ఇంజనీర్‌ల పోస్టుల భర్తీకి 2018 మే 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించారు. ఆగస్టు 31న ఫలితాలు ప్రకటించారు. పోస్టుకు ఒక్కరు చొప్పున మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సెప్టెంబర్ మాసంలో పూర్వ సర్కిల్ వారీగా వేర్వేరు తేదీల్లో కాల్ లెటర్ పంపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 497 మందికి కాకుండా 427 మందికి మాత్రమే కాల్ లెటర్ పంపారు. అంటే ఇక్కడ 70 పోస్టులు తగ్గించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ నిలిపివేశారు. అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అనంతరం నియామకాలు చేపడుతామని చెప్పారని అభ్యర్థులు తెలిపారు. ఎన్నిక కోడ్ ఎత్తివేశాక 2018 డిసెంబర్‌లో పూర్వ సర్కిల్‌ల వారీగా మరోసారి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని కాల్ లెటర్ పంపారని తెలిపారు. అయితే ఈ సమయంలో మరో 24 పోస్టులు తగ్గించారని అర్హులైన అభ్యర్థులు తెలిపారు. గతంలో కాల్ లెటర్ అందుకుని రెండోసారి కాల్‌లెటర్ అందుకోని అభ్యర్థులు వెంటనే హైకోర్టును ఆశ్రయించగా అంతకు ముందు కాల్‌లెటర్ జారీ చేసిన వారందరికీ తిరిగి జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు 427 మందికి కాల్‌లెటర్ పంపి, 403 మందికి నియామక పత్రాలు అందించి కోర్టు ఆదేశాలతో కాల్ లెటర్ పొందిన 24 మంది అభ్యర్థులను పక్కన పెట్టారు. తాము ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే కోర్టు కాల్ లెటల్ మాత్రమే జారీ చేయమని చెప్పిందని, నియామకం చేయాలని చెప్పలేదని తప్పించుకున్నారని అభ్యర్థులు వాపోయారు. ఆ తర్వాత అప్పటి సీఎండీ, పాలక వర్గానికి తమ బాధలు చెప్పుకుందామని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి వస్తే తమను గేట్ బయట నుంచి పంపించారని అభ్యర్థులు రోదించారు. కనీసం తమకు సీఎండీ, డైరెక్టర్లను కలిసే అవకాశం కూడా కల్పించకుండా వేధించారని వాపోయారు. దీంతో తాము మరోసారి హైకోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం హైకోర్టులో విచారణ జరుగుతుందని అభ్యర్థులు తెలిపారు.

అర్హత సాధించిన అభ్యర్థులతోనే భర్తీ చేయాలి..

అభ్యర్థులు నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులన్నీ రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరుతున్నారు. సబ్ ఇంజనీర్‌కు ఎంపిక య్యామని బావించి కొందరు అంతకు ముందు పని చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఉన్న ఉద్యోగం పోయి, వస్తదని అనుకున్న ఉద్యోగం రాక ఆర్థికంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు నూతనంగా కర్నాటి వరుణ్ రెడ్డిని సీఎండీగా నియమించిన తర్వాత తాము రెండు సార్లు కలువగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రస్తుతం సీఎండీ ద్వారా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు అభ్యర్థులు తెలిపారు.

ఇన్ సర్వీస్ వారితో భర్తీ..

సబ్ ఇంజనీర్ల నోటిఫికేషన్‌లో పేర్కొన్న 497 పోస్టులను నిబంధనల మేరకు పూర్తిగా అర్హులైన అభ్యర్థులచే భర్తీ చేయాల్సి ఉండగా, పోస్టులు తగ్గించి, జేఎల్ఎంలుగా పని చేస్తున్న వారికి పదోన్నతులు కల్పించి నిబంధనలకు విరుద్ధంగా ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేశారని సమాచారం. దీంతో పాటు లోకల్, నాన్ లోకల్ అంశంలో తప్పుడు రోస్టర్ విధానం అనుసరించి టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని వారిని కాకుండా ఎస్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులచే భర్తీ చేశారని, ఇక్కడ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియామకాల విభాగం చూసే అధికారిగా నిబంధనల మేరకు నడుచుకునేలా పాలక వర్గానికి సహకరించాల్సిన ఈ అధికారి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి బోర్డు అప్రూవల్ లేకుండా పోస్టులు తగ్గించడంలో కీలకంగా వ్యవహరించారని ప్రచారం సాగుతోంది.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రూప్–1 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శీలు) పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు వీలుగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత శిక్షణను 45 రోజుల పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో ఈనెల 22 తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 7330990322 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులా అభివృద్ధి సంస్థ జిల్లా అధికారిణి నిర్మల, ఎస్సీ స్టడీ సర్కిల్ వరంగల్ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్‌మోహన్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 6వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశపరీక్షను నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణ కాలంలో రాష్ట్ర స్థాయి పోటీపరీక్షలతోపాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి ఉంటుందన్నారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు

- గ్యాస్ పొయ్యిపై కోడలి చేతులు కాల్చిన అత్తమామ
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

దుగ్గొండి: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ కోడలిని వేధింపులకు గురి చేశారు. కోడలి చేతులను గ్యాస్ పొయ్యిపై కాల్చడంతో తీవ్ర గాయాల పాలైన బాధితురాలు మంగళవారం దుగ్గొండి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన అడప కోమలి–బుచ్చయ్య దంపతుల కూతురు నాగరాణిని నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన జల్లి శారద–బుచ్చయ్య దంపతుల కుమారుడు నరేష్‌కు ఇచ్చి 2007 మార్చి నెలలో వివాహం చేశారు. పెళ్లి సమయంలో ఎకరంన్నర భూమి, 15 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు చెల్లించారు. కొన్ని రోజుల పాటు సాఫీగా సాగిన సంసారంలో అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 4న తనకు రూ. 40 లక్షలు కావాలని, మీ పుట్టింటి నుంచి తీసుకురావాలని గొడవ చేసి చేయిచేసుకున్నాడు. విషయాన్ని నాగరాణి తన తల్లిదండ్రులకు తెలపడంతో ఆగ్రహించిన అత్తమామ, భర్త కలిసి నాగరాణిని బలవంతంగా గ్యాస్ స్టవ్ వద్దకు తీసుకెళ్లి చేతులను గ్యాస్‌పై ఉంచి బొబ్బలు వచ్చేలా కాల్చారు. విషయం తెలుసుకున్న నాగరాణి కుటుంబ సభ్యులు దీక్షకుంటకు రాగానే నరేష్‌తోపాటు ఆయన తల్లిదండ్రులు నాగరాణి కుటుంబ సభ్యులను కొట్టి గాయపరిచారు. దీంతో నాగరాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. చికిత్స నిమిత్తం నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.



గాయాలను చూపుతున్న నాగరాణి

గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగి అరెస్ట్

- కిలో ఎండు గంజాయి స్వాధీనం

రామన్నపేట : వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో గంజాయి విక్రస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగి మహ్మద్ జబ్బర్ ఆలీని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎస్ఐ గాలిబ్ షరీఫ్ వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో పల్సర్ బైక్‌పై గంజాయి సంచితో ఉన్న జబ్బర్ అనుమానాస్పదంగా కనిపించాడు. ఆ సంచిని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. సంచిలో ఉన్న 1.090 కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పినట్లు సీఐ పేర్కొన్నారు. వరంగల్‌లోని ఎల్బీ నగర్ నివాసముంటున్న సదరు ఉద్యోగి జబ్బర్ తన దుబారా ఖర్చుల కారణంగా స్టేషన్‌లో సీజ్ చేసి నిల్వ ఉంచిన ఎండు గంజాయిని దొంగలించి విక్రయించేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐతో పాటు కానిస్టేబుల్ శివకృష్ణ, ఉపేందర్, రాజశేఖర్‌లను కమిషనర్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

లక్ష్యంతో చదివితే సర్కారు కొలువులు...

వరంగల్ క్రైం: నిరుద్యోగ యువత లక్ష్యంతో చదివితే సర్కారు కొలువులు సాధించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగంలో జూనియర్ అసిస్టెంట్, వెస్ట్‌జోన్ డీసీపీ సీసీగా పనిచేస్తున్న బి.అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గురుకుల టీచర్ పోస్టుల్లో టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సీఎం చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్న సందర్భంగా సీపీ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూనే ప్రభుత్వ శాఖలో మరో ఉద్యోగానికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు.

యువ వితంతువులకు శిక్షణ



యువ వితంతువులకు అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ మంజులారెడ్డి

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస సెంటర్‌లో మంగళవారం యువ వితంతువులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కరీంనగర్, సిద్దిపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల నుంచి 56 మంది వితంతువులు హాజరయ్యారు. ఈశిబిరంలో ప్రోగ్రాం మేనేజర్ టి.మంజులారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో యువ వితంతువులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిళ్లు, ఆందోళనల్ని అధిగమించి సానుకూల భావాలతో ముందుకు సాగాలని, వ్యక్తిగతంగా ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలన్నారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డి.వసంత యువ వితంతువులకు స్ఫూర్తినిచ్చే మాటలు, పాటలు, గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లతో వారిలో ఆత్మస్థైర్యం నింపారు. పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల వికాస మేనేజర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళల పోరాటం

- కేయూ వీసీ తాటికొండ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సమాజంలో మహిళలు తమ హక్కులకోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాగరిక నిర్మాణంలో గొప్పపాత్ర పోషించిన మహిళలు నేడు ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత, కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ 1910లో స్త్రీ హక్కుల కోసం చేసిన పోరాటం ఫలితంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా ఉమెన్ అండ్ వెల్ఫేర్ చైల్డ్ అధికారి కె.మాధురి మాట్లాడుతూ.. బేటీపడాఓ.. బేటీ బచావో అనే నినాదం మనం నిత్యం వింటున్నప్పటికీ సమాజంలో మహిళల అభ్యున్నతికి అనుకున్నస్థాయిలో రాలేదన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి, ఫ్యాకల్టీ క్లబ్ సెక్రటరీ, ఉమెన్‌సెల్ డైరెక్టర్ శ్రీలత,అధ్యాపకులు డాక్టర్ నహిత పర్వీన్ ,శ్రీదేవి, రమాదేవి ,అడ్జెంట్‌ఆచార్యులు కృష్ణమాచార్య విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

27, 28వ తేదీల్లో జాతీయ వర్క్ షాప్

హన్మకొండ అర్బన్ : హనుమకొండలోని వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో గణితం, స్టాటిస్టిక్స్, లైబ్రరీ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో 'డేటా ఎనాలసిస్ యూజింగ్ విత్ ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్' పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు మంగళవారం జాతీయ వర్క్‌షాప్‌నకు సంబంధించిన బ్రోచర్‌ను కేయూ వీసీ టి.రమేష్ ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాప్‌నకు వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, వివిధ యూనివర్సిటీల రీసెర్చ్ స్కాలర్స్, ప్రొఫెసర్లు, విద్యార్థులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ చంద్రమౌళి కోరారు. రిజిస్ట్రేషన్స్ కోసం కోర్స్ కోఆర్డినేటర్లు ఐ.మంగమ్మ, బి.జగదీష్‌ను సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డి.రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.పార్వతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో అగ్నిప్రమాదం

- రైల్వే యార్డులో నిలిపి ఉన్న బోగి దగ్ధం
- ప్రాథమిక విచారణ ప్రారంభం



బోగిలోని దగ్ధమైన భాగం



దగ్ధమవుతున్న రైలు బోగి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే యార్డులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న రైలు బోగి దగ్ధమైంది. రైల్వే యార్డులో ట్రాఫిక్ క్లియర్ కోసం నిలిచి ఉన్న రైళ్ల మధ్యలోని ఓ బోగిలో మంటలు ఎగసిపడటంతో సమీపంలో గల కాజీపేట రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రైల్వే అధికారులు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని బోడగుట్ట వైపు గల రైల్వే యార్డులో గూడ్స్ రైళ్లు, సిక్ అయిన కోచ్‌లు, బోగీలను నిలిపి ఉంచారు. ఇటీవల సికింద్రాబాద్ నుంచి వచ్చిన రైలు బోగిని ఆ యార్డులో వేలం కోసం నిలిపి ఉంచారు. మంగళవారం ఉదయం 7 గంటలకు హైటెన్షన్ కరెంట్ తీగలకు కోతి తగలడంతో ఆ కోతి అక్కడికక్కడే కాలి మంటలతో కింద ఉన్న బోగిపై పడింది. దీంతో బోగిలో మంటలు చెలరేగాయి. అప్పటికే దట్టమైన పొగ రావడంతో సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలు అదుపు చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు దగ్ధమైన బోగిని ఆదీనంలోకి తీసుకొని గార్డింగ్ చేశారు. ఈ ఘటనలో రూ.కోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం.

విచారణ ప్రారంభం

కాజీపేట రైలు బోగి దగ్ధంపై అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. ఆకతాయిలు ఎవరైన బోగిలోకి ప్రవేశించి సిగరేట్ తాగి పడేశారా.. ఎవరైన కావాలని చేసి ఉంటారా.. కోతి వల్లే ఈ ప్రమాదం జరిగిందా.. ఇంకేమైనా కారణాలతో బోగి దగ్ధమైందా.. అన్న కోణాల్లో విచారణ చేపట్టారు.

గతంలోనూ ఘటనలు..

కాజీపేట రైల్వే యార్డులో గతంలో 2016లో నిలిపి ఉన్న రెండు బోగీలు దగ్ధమయ్యాయి. 2009లో సీఅండ్‌డబ్ల్యూ సిక్‌లైన్‌లో రైలు బోగి, 2006లో ఫాతిమానగర్‌లో వాషింగ్ సైడింగ్‌లో పుష్‌పుల్ బోగీలు, 2008 ఆగస్టు 1న కేసముద్రం–తాళ్లపూసపల్లి మధ్య గౌతమి బోగీలు దగ్ధమయ్యాయి. కాగా ఒక రైలు బోగి జీవిత కాలం 15 సంవత్సరాలు, ఒక బోగి ఖరీదు రూ.8 కోట్ల వరకు ఉంటుందని రైల్వే రిటైర్డ్ నిపుణులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి ఓ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక ఇటీవల అదృశ్యమైంది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఓ యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బాలికను ఇంటికి తీసుకెళ్లగా.. సీసీ పుటేజీలను పరిశీలించిన అనంతరం పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని సోమవారం సాయంత్రం తల్లికి అప్పగించారు. ఆ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఓ వ్యక్తిపై కేసు..

కర్రలోడ్ పంపిస్తానని చెప్పి ఒకరి నుంచి రూ.5 లక్షలు కాజేసి.. తిరిగి డబ్బులడిగితే చంపేస్తానని బెదిరించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య తెలిపారు. ఖిలా వరంగల్ మండలం స్తంభంపెల్లి గ్రామానికి చెందిన జిల్లారపు మధుసూదన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా శ్రీసాయి గణేశ్ పేరు మీద టింబర్ డిపో నడిపిస్తున్నాడు. కర్రలోడ్ కోసం నాగపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌కు పలు దఫాలుగా సుమారు రూ.5లక్షలు ఇచ్చాడు. కర్రలోడు ఇవ్వకుండా ముఖం చాటేస్తున్న జ్ఞానేశ్వర్‌ను నిలదీయడంతో చంపుతానని బెదిరించాడు. దీంతో మంగళవారం మధుసూదన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికి టీఎస్ఈఈయూ కృషి



సమావేశంలో ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో టీఎస్ ఈఈయూ–327 హనుమకొండ, వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నాయకత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. ఆ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 6, 7 తేదీల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలో యూనియన్ పతాకావిష్కరణ కార్యక్రమం, యూనియన్ జిల్లా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. 6న నర్సంపేటలో పతకావిష్కరణ, యూనియన్ సమావేశం, 7వ తేదీన హనుమకొండ, వరంగల్‌లో పతాకావిష్కరణ ఉంటుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్న భోజన అనంతరం యూనియన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లా స్థాయి సమావేశం ఉంటుందన్నారు. యూనియన్ సభ్యులు, విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకుడు ఐలేష్, వరంగల్ కార్యదర్శి మచ్చిన బుచ్చయ్య గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికల సదయ్య, కార్యదర్శి ఓదేలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌వెలుగుల్లో 'కాళేశ్వర ముక్తీశ్వరస్వామి'



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల కోసం ఆలయాన్ని మంగళవారం రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో కాళేశ్వరం పరిసరాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. - కాళేశ్వరం

సాక్షి క్లాసిఫైడ్స్